సాక్షి
సంగారెడ్డి

గురువారం । 21 । మార్చి । 2024



ఆన్‌లైన్ కష్టాలు తీరేనా?

ఆలయంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించి రెండేళ్లు గడిచినా ప్రజాధారణ లేదు.

వివరాలు 8లో ▸



సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

కంగ్టి మండలానికి చెందిన 30 మంది రైతులకు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ తరగతులను నిర్వహించారు.

వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

ఎన్నికల నిబంధనలను తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని విధిగా పాటిస్తూ సహకరించాలని ఆర్డీఓ అశోక చక్రవర్తి సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. ఎన్నికలు ప్రశాంతగా నిర్వహించడానికి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే మాణిక్ కారు తనిఖీ



ఎమ్మెల్యే మాణిక్‌రావు కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

జహీరాబాద్: ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ప్రయాణిస్తున్న కారును పోలీసులు తనిఖీ చేశారు. బుధవారం బీఆర్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్లి తిరిగొస్తుండగా గంగ్వార్ క్రాస్ రోడ్డు, బీదర్ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద కారును ఆపి తనిఖీ చేశారు. కాగా పోలీసులకు ఎమ్మెల్యే సహకరించారు. లోకసభ ఎన్నికలు జరగనున్న సందర్భంగా పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

నగదు రహిత వైద్యం

- మంత్రికి రిటైర్డ్ ఉద్యోగుల వినతి

సంగారెడ్డి : విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు కల్పించాలని మంత్రి దామోదర రాజనర్సింహను రిటైర్డ్ ఉద్యోగులు సంఘం నేతలు బుధవారం విన్నవించారు. సంగారెడ్డి లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వారు కలిశారు. ఈ సందర్భంగా వరా మాట్లాడారు. ఉద్యోగులకు సకాలంలో మెడికల్ రీయింబర్స్ మెంట్ బిల్లు అందక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేసి, సభ్యులుగా నియమించి, ఈఎస్‌ఐ సౌకర్యం కలిగించాలని కోరారు. అందుకు మంత్రి సానుకులంగా స్పందించారని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, నాయకులు నవాబురెడ్డి, జగదీశ్వర్, బసవేశ్వర్ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయండి



నాయకులతో మాట్లాడుతున్న దేవుజా

పటాన్‌చెరు టౌన్: పోలింగ్ స్టేషన్ ల వద్ద పోలీస్ బందోబస్తుతోపాటు బూత్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీ నేతలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఎన్నికల అధికారి దేవుజాను కోరారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాపై వివిధ పార్టీల రాజకీయ నాయకులతో కలిసి ఆయన తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల రోజు ఓటర్ స్లిప్పులు రానివారికి ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. అదేవిధంగా బూత్‌లలో కూర్చునే ఏజెంట్లకు పాసుల ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎస్‌కే అతిక్, సీపీఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మెదక్ నుంచి కేసీఆరే!

గులాబీ దళపతి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. మెదక్ ఎంపీ స్థానం నుంచి బరిలో దిగనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అలాగే శ్రేణులను కార్యోన్ముఖులను చేసేలా రంగం సిద్ధమైనట్లు సమాచారం. మరో వైపు వంటేరు ప్రతాప్ రెడ్డికి బీఆర్‌ఎస్ టికెట్ ఖరారైనట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మెదక్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి తేలిన తరువాతే బరిలో ఎవరుంటారన్నది తేలనుందని బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో జహీరాబాద్, మెదక్ లోక్‌సభ స్థానాలున్నాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు జహీరాబాద్ స్థానానికి అభ్యర్థులను ప్రకటించాయి. కానీ మెదక్ కు వచ్చేసరికి బీజేపీ మాత్రమే అభ్యర్థిని ప్రకటించింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు మాత్రం తమ అభ్యర్థులెవరో ఇంకా ప్రకటించకపోవడంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది. ఈ ఉత్కంఠకు ఎప్పుడు తెరపడనుందో వేచిచూడాల్సిందే మరి..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి



గులాబీ దళపతి వ్యూహాత్మక అడుగులు

- కాంగ్రెస్ అభ్యర్థి తేలాకే ప్రకటించే యోచనలో బీఆర్‌ఎస్
- మరోవైపు వంటేరు ఖరారైనట్లు జోరుగా ప్రచారం
- అధికార, ప్రతిపక్షం అభ్యర్థుల ఎంపికలో వీడని ఉత్కంఠ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : మెదక్ లోక్‌సభ అభ్యర్థిత్వం విషయంలో గులాబీ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని జహీరాబాద్ టికెట్‌ను ప్రకటించినప్పటికీ, మెదక్ విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ టికెట్‌ను వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఇవ్వాలని అధినేత కేసీఆర్ పక్షం రోజుల క్రితమే నిర్ణయం తీసుకున్నప్పటికీ ఇంకా అధికారికంగా ప్రకటించడం లేదు. కాంగ్రెస్ అభ్యర్థిత్వం తేలిన తర్వాత ఇక్కడి అభ్యర్థిని ప్రకటించే అవకాశాలున్నాయని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ టికెట్‌పై ఉత్కంఠ అలాగే కొనసాగుతోంది. కాగా ఈ టికెట్ కోసం మరో ఇద్దరు ముఖ్యనాయకులు పోటీ పడుతున్నారు. మరికొంత మంది కూడా ఆశిస్తున్నారు. ముఖ్యంగా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలువుల మదన్‌రెడ్డి రేసులో ఉన్నారు. కొన్ని నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ టికెట్‌ను సునీతారెడ్డికి ఖరారు చేసిన సందర్భంగా ఆయనకు ఎంపీ టికెట్ ఇస్తామని బీఆర్‌ఎస్ అధినాయకత్వం హామీ కూడా ఇచ్చింది. అలాగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన గాలి అనిల్‌కు కూడా ఎంపీ టికెట్ ఇస్తామనే హామీ ఇచ్చారు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయనకు జహీరాబాద్ టికెట్ ఖరారు చేశారు. మరోవైపు తమకే కేటాయించాలని సంగారెడ్డికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బీరయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డిలు కూడా అధినాయకత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అధినేత కేసీఆర్ మాత్రం వంటేరు ప్రతాప్‌రెడ్డికి ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన్ను లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పని చేసుకోవాలని సూచనప్రాయంగా చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. కానీ అధికారికంగా మాత్రం ప్రకటించకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఒకటీ రెండు రోజుల్లో ప్రకటించే అవకాశాలున్నాయి. బీజేపీ మాత్రం వారం రోజుల క్రితమే ప్రకటించింది. ఈ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు కేటాయించింది. ఆయన నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటున్నారు.

అధినేతే బరిలోకి దిగుతారనే ప్రచారం?

ఈ మెదక్ లోక్‌సభ స్థానం నుంచి స్వయంగా అధినేత కేసీఆరే బరిలోకి దిగే అవకాశాలు లేకపోలేదనే ప్రచారం కూడా షురూవైంది. అందుకోసమే ఈ అభ్యర్థిత్వాన్ని అధికారిక ప్రకటన జరగలేదనే టాక్ జోరందుకుంటోంది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గెలుచుకునే సీట్లలో మెదక్ సీటు ముందుంటుందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు ఎమ్మెల్యే స్థానాల్లో ఆరు చోట్ల బీఆర్‌ఎస్ విజయం సాధించింది. ఒక్క మెదక్ అసెంబ్లీ స్థానం మాత్రం కాంగ్రెస్ గెలిచింది. ఈ ఎన్నికల్లో కూడా కారు జోరందుకునే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ టికెట్ విషయమై వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో నెలకొంది.

భగీరథకు జల గండం!

- నిలిచిపోయిన గోదావరి జలాల ఎత్తిపోత
- మేడిగడ్డ ఘటన నేపథ్యమే కారణం
- సిద్దిపేట, జనగామ, మెదక్, సూర్యాపేట జిల్లాలకు ఇక్కడి నుంచి సరఫరా
- మరింత తగ్గితే పరిస్థితి ఆందోళనకరమే



గజ్వేల్: జంటనగరాల్లోని వివిధ ప్రాంతాల్లో తాగ నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు గోదావరి సుజల స్రవంతి పథకాన్ని చేపట్టారు. పన్నెండేళ్ల క్రితం రూ.3,375కోట్ల అంచనా తో పనులు చేపట్టి పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లా ఎల్లంపల్లి బ్యారేజీ నుంచి 10 టీఎంసీల నీటిని తరలించాలన్నది లక్ష్యం. ఇందుకోసం హైదరాబాద్ వరకు 186 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌ను విస్తరించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట సమీపంలోని ఘణపూర్ వద్ద నిర్మించిన డబ్ల్యూటీపీ ద్వారా సరఫరా చేస్తున్నారు. నిత్యం ఈ లైన్ ద్వారా 735 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరుగుతోంది. ఇందులో సిద్దిపేట, జనగామ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాలు.. సుమారు 300ఎంఎల్‌డీ నీటిని గతంలో వాడుకునే వారు. మిగతా నీరు హైదరాబాద్ నగర అవసరాలకు వెళ్లేది. నగరానికి వెళ్లే నీటిలో అప్పుడప్పుడు కొరత ఏర్పడేది. అంతేకాకుండా నీరు తక్కువగా వచ్చినప్పుడు ఆయా జిల్లాలకు సైతం ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో మిషన్ భగీరథ స్ఫూర్తికి అవరోధం ఏర్పడే ప్రమాదముంది.

రూ.1100కోట్లకుపైగా వ్యయం..

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే దిశలో రూ.1100కోట్లకుపైగా వ్యయంతో మల్లన్నసాగర్ రిజర్వాయర్ ఆధారంగా 'మల్లన్నసాగర్ భగీరథ' పథకాన్ని చేపట్టి అందుబాటులోకి తెచ్చారు. రిజర్వాయర్‌ను 50టీఎంసీల సామర్థ్యంతో నిర్మించగా... ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో సాగునీటి కొరత తీరుస్తున్నది. ఇందులో మల్లన్నసాగర్ భగీరథ పథకానికి ఏటా 10 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు వాడుకోవాలని నిర్ణయించారు. కొండపాక మండలం మంగోల్ వద్ద రాష్ట్రంలోనే అతి పెద్దదిగా 540 ఎంఎల్‌డీ సామర్థ్యంతో డబ్ల్యూటీపీని నిర్మించారు. ఈ క్రమంలోనే నగరానికి వెళ్లే లైన్‌పై కొండపాక వద్ద ట్యాపింగ్ మూసేశారు. గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గ అవసరాల కోసం మాత్రం నిత్యం 62–63 ఎంఎల్‌డీల నీటి ట్యాపింగ్ మాత్రం కొనసాగుతున్నది. గతంతో పోలిస్తే నగరం లైన్‌పై భారం దాదాపుగా తగ్గించారు.

ప్రస్తుతం అందుబాటులో వచ్చిన మల్లన్నసాగర్ భగీరథ పథకం ద్వారా సిద్దిపేట, జనగామ, మెదక్, సూర్యాపేట జిల్లాలకు నిత్యం సుమారుగా 150ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి సరఫరా జరుగుతోంది. త్వరలోనే మేడ్చల్, యాదాద్రి జిల్లాలకు సైతం ఇక్కడి నుంచే మంచినీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పైప్‌లైన్‌ల వ్యవస్థ అక్కడక్కడా అసంపూర్తిగా ఉండటం వల్ల కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది.

ఉన్నతాధికారులకు వివరించాం

మల్లన్నసాగర్ భగీరథ పథకం నీటి సరఫరాకు ప్రస్తుతానికి ఇబ్బంది లేదు. సిద్దిపేట, జనగామ, మెదక్, సూర్యాపేట జిల్లాల్లోని ఆవాసాలకు ఇక్కడి నుంచి తాగునీరు సరఫరా జరుగుతున్నది. రాబోవు రోజుల్లో మేడ్చల్, యాదాద్రి జిల్లాలకు సైతం ఇక్కడి నుంచే తాగునీటి సరఫరా జరుగనుంది. దీనివల్ల రిజర్వాయర్‌లో నీటి వాడకం అమాంతంగా పెరగనున్నది. ఆ సమయంలో నీటి నిల్వలు లేకపోతే ఇబ్బందులు వస్తాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు వివరించాం.

– రాజయ్య,
మిషన్ భగీరథ ఈఈ, గజ్వేల్



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న డీడబ్ల్యూఓ లలితకుమారి

పోషకాహారంతోనే ఆరోగ్యం

డీడబ్ల్యూఓ లలితకుమారి

జహీరాబాద్: పోషకాలతో నిండి ఉన్న ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీడబ్ల్యూఓ లలితకుమారి అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన పోషణ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. డీడీఎస్ ద్వారా చిన్న పిల్లలు, గర్భిణి, బాలింతలకు పోషకాహారం అందజేస్తున్నామన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతే కాకుండా బేటీ బచావో బేటీ పఢావో ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ విషయమై అవగాహన కల్పించారు. మహిళలు, కిశోర బాలికల గురించి తెలిపారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలని, ఆడపిల్లల బాధ్యతల గురించి తల్లులకు తెలియజేశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు జరిపారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం అధికారి కల్పన, మెప్మా అధికారి అనిత, డీడీఎస్ ప్రతినిధి లక్ష్మమ్మ, ప్రాజెక్టు సీడీపీఓ సునీతబాయి, సూపర్‌వైజర్లు అంజమ్మ, అనితకుమారి, ఎం.సునీత, తులసమ్మ, నీరజ, గ్రేస్, విజయలక్ష్మి, సద్గుణ, రాధమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే ముఖ్యం

ఐజీ సుధీర్ బాబు



మాట్లాడుతున్న ఐజీ సుధీర్ బాబు

సంగారెడ్డి టౌన్ : లోక్ సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే తమ లక్ష్యమని మల్టీజోన్–2 ఐజీ సుధీర్ బాబు వెల్లడించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఆపై అధికారులతో కలిసి ఆయన సమావేశమయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఇంటర్ స్టేట్ అండ్ ఇంటర్ డిస్ట్రిక్ ఎస్పీల కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించామన్నారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లా ఇతర రాష్ట్రాలకు బార్డర్‌గా ఉందన్నారు. దీంతో ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బార్డర్ జిల్లాలోని ఎస్పీలతో కో ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలో కోడ్ అమలులో ఉండటం, నిఘా ఎక్కువగా ఉండటం వల్ల క్రిమినల్స్ బార్డర్లో తలదాచుకుంటున్నారని అన్నారు. వారిని కట్టడి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించామన్నారు. జిల్లా పరిధిలో బార్డర్ చెక్ పోస్టులు, ఇంటర్ డిస్ట్రిక్ట్, ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు పెంచుతున్నామన్నారు. ఇక్కడ అవసరమైన సిబ్బందిని నియమిస్తామన్నారు. సంగారెడ్డి జిల్లాలో శాంతి భద్రతల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా సమర్థవంతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎస్పీ రూపేష్, పోలీస్ బృందం తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రాధాన్యం

డీడీఎం త్రిమూర్తి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతుల అభివృద్ధే నాబార్డు లక్ష్యమని డీడీఎం సిసిఎల్ త్రిమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని జగదేవ్‌పూర్‌లో పీస్ సంస్థ కార్యాలయంలో నాబార్డు, గోద్రేజ్ సహకారంతో ప్రారంభించిన వాటర్‌షెడ్ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. వర్షపు నీటిని వడిసిపట్టి భూమిలోకి ఇంకే విధంగా రాతి కట్టడాలు, పామ్ పాండ్స్ పనుల బాధ్యత కమిటీ సభ్యులదేన్నారు. గోద్రేజ్ సంస్థ డైరెక్టర్ దింపి దేవ్ మాట్లాడుతూ పీస్ సంస్థ వారి సహకారంతో వాటర్‌షెడ్ కార్యక్రమాలు అమలు చేయడం అభినందనీయమన్నారు. మండలంలోని ఏడు గ్రామాల్లో వాటర్ షెడ్ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, వాటర్ షెడ్ సభ్యులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు ముమ్మరం

- జిల్లావ్యాప్తంగా రూ. 43.52 కోట్లు
- ఇప్పటి వరకు రూ. 25 కోట్లు ...
- ఈనెలాఖరు వరకు 100 శాతం పూర్తి



హుస్సెళ్లిలో పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లాలో ఇంటి పన్నుతో పాటు ఇతర పన్నులు వసూలు చేసే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. గత తరహాలోనే నిర్ణిత సమయం కంటే ముందే పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పన్నులు వసూలు చేసేందుకు ఇంటి బాట పట్టారు. జిల్లాలో 25 మండలాలు 647 పంచాయతీలున్నాయి. జిల్లా వ్యాప్తంగా రూ.43,52,37,830 పన్నులు వసూలు చేయవలసి ఉండగా ఇప్పటి వరకు రూ. 25 కోట్లు వసూలు అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని 25 మండలాలు ఉండగా అందులో నారాయణఖేడ్, మునిపల్లి మండలాల్లో వంద శాతానికి దగ్గరలో ఉన్నాయి. అమీన్‌పూర్, అందోల్, కంగ్టి, పటాన్‌చెరు, పుల్‌కల్, న్యాల్‌కల్, సంగారెడ్డి, సిర్గాపూర్, జహీరాబాద్ మండలాలు 50 శాతం మించలేదు. 647 పంచాయతీల్లో ఇప్పటి వరకు 100కుపైగా గ్రామ పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలయ్యాయి.

పంచాయతీల ఖాతాల్లో జమ

వసూలైన పన్నులను కార్యదర్శులు ఆయా పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. ప్రజలంతా ఇంటి పన్నుతో పాటు ఇతర పన్నులు తప్పకుండా కట్టాలని, దాని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ తిరిగి వసూలు చేసిన సొమ్మును ఎప్పటికప్పుడు బ్యాంక్‌ల ద్వారా ఖాతాల్లో జమ చేస్తున్నారు. వసూలు చేసిన వాటితో గ్రామాల్లో తాగు నీటి ట్యాంక్‌లు, మురుగు కాల్వలను శుభ్రం చేయించడం, పగిలిన పైప్‌లైన్‌లు, లీకేజీల మరమ్మతులు చేయించడం, వీధి దీపాలను ఏర్పాటు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వంద శాతం వసూలు చేశాం



ప్రజలకు పన్నులు కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాను. చెల్లించిన పన్నులు గ్రామాల అభివృద్ధికి ఉపయోగిస్తామని చెప్పాను. ఇంటింటికీ తిరిగే అవసరం లేకుండా ప్రజలే పంచాయతీకి వచ్చి వాటిని చెల్లించారు. వంద శాతం వసూలు చేశాం. నాగభూషణం,

పంచాయతీ కార్యదర్శి, హుస్సెళ్లి

ఈ నెలాఖరు వరకు...



ఇప్పటి వరకు జిల్లాలో 80 శాతం మేర పన్నులు వసూలు చేశాం. 100కుపైగా పంచాయతీల్లో వంద శాతమైంది. అన్ని గ్రామాల్లో కార్యదర్శులు ఇంటింటికీ తిరుగుతున్నారు. చాలా గ్రామాల్లో వసూళ్లు పూర్తి కావచ్చాయి. ఈ నెలాఖరు వరకు అన్ని గ్రామాల్లో వంద శాతం వసూలు చేస్తాం. వాటిని అభివృద్ధి పనులకు వినియోగిస్తాం.

సురేష్ మోహన్, డీపీఓ, సంగారెడ్డి

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా

బీఆర్‌ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్



అనిల్ కుమార్, ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటానని, అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్‌ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మామిడ్గి శివారులో గల ఎస్‌ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. దీంతో ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని విమర్శించారు. ఇటీవల నిర్వహించిన శాసన సభ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం ప్రజలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అయినటువంటి మాణిక్ రావుకు మంచి మెజార్టీని ఇచ్చారన్నారు. అదే విధంగా తనకూ భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. లోక్‌సభ పరిధిలోని ఈ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. తొలుత అనిల్‌కు, ఎమ్మెల్యే మాణిక్‌రావుకు నేతల ఘనంగా సన్మానించారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు నర్సింహరెడ్డి, భాస్కర్, శ్రీకాంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

మల్లన్న స్వామి జాతర


జాతరలో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో మల్లన్నస్వామి జాతర కనుల పండువగా నిర్వహించారు. జాతరలో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ప్రజా ప్రతినిధులను, నాయకులను సన్మానించారు. వెంక్యా తండాకు చెందిన చిన్నారికి అత్యవసర చికిత్స నిమిత్తం రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కేహెచ్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ హన్మంత్‌రావ్, కో ఆప్షన్ మెంబర్ లాయక్, నాయకులు చంద్రగౌడ్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, దుర్గేశ్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకున్న పలు సైబర్ మోసాల వివరాలను సీపీ బుధవారం వెల్లడించారు. మర్కూక్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని లింకు రాగా నమ్మి పలు దఫాలుగా డబ్బులు పంపాడు. అనంతరం ఒకేసారి రూ.80 వేలు పెట్టుబడి పెట్టాడు. లింకు ఓపెన్ చేసి చూడగా బ్లాక్ చేసి ఉండడంతో అనుమానంతో జాతీయ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. అలాగే, సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు చెప్పాలని అడుగగా నమ్మిన బాధితుడు ఓటీపీ వివరాలు తెలుపగా తన ఖాతా నుంచి రూ.36,684 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ప్రజలు నమ్మే స్థితిలో లేరు

- బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు

గజ్వేల్‌రూరల్: త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో 17 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోసారి మభ్యపెట్టేందుకు వస్తున్నారన్నారు. కార్యకర్తలంతా సమష్టిగా ఉండి తెలంగాణలోని 17 స్థానాల్లో బీజేపీని గెలిపించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కప్పర ప్రసాదరావు, ఎల్లు రాంరెడ్డి, నాయకులు గురువారెడ్డి, నందన్‌గౌడ్, వెంకటరమణ, సాయిబాబా, మహేశ్, ఎల్కంటి సురేశ్, ఉప్పల మధుసూదన్, మనోహర్ యాదవ్, అశోక్‌గౌడ్, కిరణ్‌రెడ్డి, ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

చేర్యాల(సిద్దిపేట): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలోని చుంచనకోట శివారులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దామోదర్ తెలిపిన వివరాల ప్రకారం.. చుంచనకోట గ్రామ శివారులో బొడిగం నర్సారెడ్డికి చెందిన మామిడి తోటలో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడు చేశారు. ఇందులో ఇద్దరిని అదుపులోకి తీసుకొని రూ.31,410, 6 సెల్ ఫోన్లు, కారు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787738]

WANTED

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13624]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233893]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆన్‌లైన్ కష్టాలు తీరేనా?

- మల్లన్న ఆలయంలో కొరవడిన సేవలు
- 2022లో ప్రారంభించినా నిరుపయోగం
- రెండేళ్లుగా బుకింగ్ కాని వైనం
- భక్తులకు అవగాహన కల్పించని ఆలయ నిర్వాహకులు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరగడంతోపాటు ఆదాయం పెరుగుతోంది. ప్రతీ ఏడాది 30 నుంచి 40 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. దీంతో సుమారు రూ.20 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఇంత పెద్ద ఎత్తున ఆదాయం వస్తున్నా కొమురవెల్లి ఆలయంలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడం లేదు. దీంతో దర్శనం టికెట్ తీసుకోవడానికి గంటల తరబడి లైన్ నిల్చొని అవస్థలు పడుతున్నారు. - కొమురవెల్లి(సిద్దిపేట)


కొమురవెల్లి ఆలయంలో దర్శనం టికెట్ కోసం లైన్‌లో నిల్చున్న భక్తులు

భక్తుల సౌకర్యం కోసం 2022 ఫిబ్రవరిలో అప్పటి దేవాదాయ కమిషనర్ అనీల్‌కుమార్ టీయాప్‌లో 12 రకాల సేవలు స్వామి వారి నిత్య కల్యాణం, అభిషేకం, కుంకుమార్చన, శాశ్వత కల్యాణం, శాశ్వత పూజ, నజరు, చెలకపట్నాలు, తిరుగుడుకోడె, వీవీఐపీ దర్శనం, ఉప ఆలయమైన రేణుక ఎల్లమ్మ అర్చణ, ఎల్లమ్మ పట్నాలకు సంబంధించిన సేవలను నమోదు చేశారు.

రెండేళ్లుగా కేవలం ఐదుగురే..

ఆలయంలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించి రెండేళ్లు గడిచినా ప్రజాధారణ లేక ఇప్పటి వరకు ఐదుగురు భక్తులు మాత్రమే ఆన్‌లైన్ సేవలు వినియోగించుకున్నారు. లక్షలాది భక్తులు స్వామి వారి దర్శనానికి వచ్చే ఆలయంలో కేవలం ఐదుగురు భక్తులే ఆన్‌లైన్ సేవలు వినియోగిచుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆలయ అధికారులు టీయాప్‌కు సంబంధించి భక్తులకు తెలిసేలా సైన్ బోర్డు ఏర్పాటు చేసి ఆలయంలో ఆన్‌లైన్ కొనసాగుతున్నట్టు ప్రచారం చేయాలి కానీ అవేవి కనిపించడం లేదు. ప్రస్తుతం ఉన్న టీయాప్‌లోని 12 రకాల సేవలతోపాటు ఆర్జిత సేవలు, మొక్కుబడులు దర్శనాలు, వసతిగదుల అద్దె, ప్రసాద విక్రయ టికెట్లు, ఆన్‌లైన్ చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో దర్శనాలు, ప్రసాదం, పటాన్ల టికెట్లను రీ సెక్లింగ్ చేస్తూ ఆలయ ఉద్యోగులతో పాటు ప్రైవేటు బ్యాంకు ఉద్యోగులు పట్టుబడ్డారు పలువురిపై కేసులు నమోదు కూడా చేశారు. ఈ క్రమంలో అవినీతికి ఆస్కారం లేకుండా మిగిత సేవల టికెట్లును కూడా ఆన్‌లైన్ చేసి వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి



కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించాలి. భక్తులకు కూడా సేవలు ఉన్నట్లు తెలుస్తుంది. ఎక్కువ సేపు లైన్ నిల్చొని టికెట్లు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. దీంతో ఆలయంలో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట వేయొచ్చు.

- సనాది కరుణాకర్, భక్తుడు

వినియోగంలోకి తెస్తాం



కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర, జాన పదుల జాతర సమయంలో భక్తులు భారీ సంఖ్యలో వస్తున్నారు. ఆన్‌లైన్ సేవలపై అవగాహన లేకపోవడంతో టికెట్లు బుక్ చేసుకోవడం లేదు. 2022 నుంచి ఇప్పటి వరకు కేవలం ఐదుగురు భక్తులు మాత్రమే ఆన్‌లైన్ సేవలను వినియోగించుకున్నారు. త్వరలో ఆన్‌లైన్ సేవలు వినియోగంలోకి తీసుకొస్తాం.

- బాలాజీ, ఆలయ ఈవో

నోటి శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

గీతంలో ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం


మాట్లాడుతున్న నోముల రాము

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ (జీఎస్పీ)లో బుధవారం 'ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని' నిర్వహించారు. 'పరిశుభ్రమైన నోరే.. ఆరోగ్యకరమైన దేహం' అనే ఇతివృత్తంతో జరిగిన కార్యక్రమంలో రూట్ కెనాల్, ఫేషియల్ ట్రామా కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ నోముల రాము ముఖ్య అతిథిగా హాజరై సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నోటి పరిశుభ్రత ప్రాముఖ్యత వివరించారు. నోటి నుంచి బ్యాక్టీరియా రక్త ప్రవాహంలోకి ప్రవేశించి శరీరంలోని ఇతర భాగాలపై ప్రభావం చూపుతుందన్నారు. కాస్మోటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ కె.మౌనిక మాట్లాడుతూ.. సరైన జీర్ణక్రియ, ఆత్మగౌరవం, ఇరుగు పొరుగుతో సులువుగా కలవడం వంటి వాటి కోసం నోటిని ఆరోగ్యకరంగా ఉంచుకోవడం ఎంతో అవసరమన్నారు. గీతం స్టూడెంట్ లెఫ్, గీతం ఫార్మసీ స్టూడెంట్ అసోసియేషన్ (జీపీఎస్‌ఏ) సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శివ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పవన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి..

కుంటలో పడి వ్యక్తి మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామ శివారులో ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. చండూర్ గ్రామానికి చెందిన రామరాయిని మహిపాల్ రెడ్డి(43) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మహిపాల్‌రెడ్డి మంగళవారం ఉదయాన్నే పొలం వద్దకు వెళ్లాడు. పిల్లలను స్కూల్‌కు పంపించే సమయమైనా ఇంటికి రాకపోవడంతో భార్య స్వప్న పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. విషయాన్ని బావ గోవర్ధన్ రెడ్డికి చెప్పగా, అతను పొలం వద్ద గాలించగా పొలం పక్కనే ఉన్న గంగనికుంట వద్ద ఫోన్, టవల్ గుర్తించాడు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి వెతకగా మహిపాల్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెంది ఉంటాడని భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాయని ఎస్‌ఐ తెలిపారు.

వలస వెళ్లి.. ప్రాణాలు విడిచి

చెరువులో మునిగి గొర్రెల కాపరి మృతి


రాములు(ఫైల్)

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు చెరువులో పడి గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామానికి చెందిన జంగంపల్లి రాములు (55) గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగు నెలల కిందట గొర్రెల మేపేందుకు తోటి కాపరులతో కలిసి ఇంటిని విడిచి సంచార జీవనం సాగిస్తున్నాడు. గొర్రెలను మేపుతూ బొడ్మట్‌పల్లి గ్రామ చెరువులో నీటిని తాపి అవతలి వైపునకు దాటిచేందుకు చెరువు లోతు చూస్తూ లోపలికి వెళ్లాడు. దీంతో ప్రమాదవశాత్తు చెరువులో నీట మునిగాడు. తోటి కాపరులు, స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పెద్దశంకరంపేటలో గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళీ తెలిపారు.

పిడుగుపాటుతో గేదె మృతి


గేదెను చూపుతున్న బాధిత రైతు

చిన్నకోడూరు(సిద్దిపేట): పిడుగుపాటుతో గుర్రై పాడి గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మైలారం గ్రామ పంచాయతీ మధిర కొండెంగల కుంటలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సందెబోయిన ఓజయ్య రోజు మాదిరిగా పశువులను పొలం వద్ద కట్టేసి ఇంటికొచ్చాడు. రాత్రి కురిసిన ఈదురు గాలులు, పొలం సమీపంలో పిడుగు పడటంతో పాడి గేదె మృతి చెందింది. బుధవారం పొలం వద్ద గేదెను చూసిన రైతు బోరున విలపించాడు. సుమారు రూ. 50 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు.


ఆవు వద్ద బాధిత రైతు

విద్యుదాఘాతంతో పాడి ఆవు..

కొండపాక(గజ్వేల్): ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డిని మేస్తూ విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన కొండపాక మండలంలోని బందారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మరుమాముల రాంచంద్రం రోజు మాదిరిగానే పాడి ఆవును వ్యవసాయ బావి వద్ద మేతకు తీసుకెళ్లాడు. మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. పాల విక్రయం జీవనాధారంగా మారిందని, సుమారు రూ.50 వేల విలువ ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఇద్దరు పిల్లలతో పాటు తల్లి అదృశ్యమైన ఘటన చిలప్‌చెడ్ మండలం బద్రియా తండాలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. బద్రియా తండాకు చెందిన పాత్లోత్ శ్రీనివాస్‌కు పాడ్చన్‌పల్లి లక్ష్మీనగర్ తండాకు చెందిన శీలాతో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు అభిరాం, రఘురాం ఉన్నారు. కుటుంబ సమస్యలతో తరుచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. 19వ తేదీన మంగళవారం శీల, భర్త ఇంట్లో లేని సమయంలో ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. ఇంటికి వచ్చిన శ్రీనివాస్ చుట్టు పక్కల వారిని, బంధువులను ఆరా తీయగా సమాచారం లభించలేదు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాయని ఎస్‌ఐ తెలిపారు.

గేట్ వాల్ గుంతలో పడి..


- సఫాయి కార్మికుడు మృతి


శంకరయ్య (ఫైల్)

దుబ్బాకరూరల్: గేట్ వాల్ గుంతలో పడి సఫాయి కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్ద గుండవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంకంగారి శంకరయ్య(61) గ్రామంలో నీటిని సప్లయ్ చేసే పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే గ్రామానికి నీళ్లు వదిలేందుకు మంగళవారం రాత్రి 10 గంటలకు నీటి ట్యాంకు వద్దకు వెళ్లి గేట్ వాల్ ఉన్న గుంతలో ప్రమాదవశాత్తు బోర్లా పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అతడి కుమారుడు నర్సింలు వెళ్లి చూడగా గేట్ వాల్ గుంతలో బోర్లా పడి ముక్కుకు, చాతికి గాయాలతో కనిపించాడు. వెంటనే గ్రామస్తుల సహాయంతో సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి శంకరయ్య మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బండారి రామచంద్రం గ్రామస్తులు కోరారు.

16వ అంతస్తు పైనుంచి పడి

- తీవ్ర గాయాలతో ఎలక్ట్రీషన్ మృతి


జితేందర్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: 16వ అంతస్తు నుంచి పడి తీవ్ర గాయాలతో ఎలక్ట్రీషన్ మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన జితేందర్(34) బతుకుదెరువు కోసం రామచంద్రాపురం మండలం వెలిమల గ్రామానికి వచ్చాడు. స్థానికంగా నివాసం ఉంటూ ఓ సంస్థకు చెందిన భవన నిర్మాణంలో ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నాడు. బుధవారం 16వ అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ధర్నా చేస్తున్న ట్రిపుల్‌ఆర్ భూ బాధితులు

భూమికి బదులు భూమి ఇవ్వాలి

- గజ్వేల్‌లో ట్రిపుల్‌ఆర్ భూ బాధితుల ధర్నా
- సముచిత పరిహారం ఇవ్వాలని డిమాండ్

గజ్వేల్: ట్రిపుల్‌ఆర్ నిర్మాణం వల్ల తీవ్రంగా నష్టపోతున్న తమకు భూమికి భూమి ఇవ్వాలని, లేని పక్షంలో సముచిత నష్ట పరిహారం అందించాలని మర్కూక్ మండలం చేబర్తి, నర్సన్నపేట గ్రామాలకు చెందిన భూ బాధితులు డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లోని ఐవోసీ (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎకరానికి బహిరంగ మార్కెట్‌లో రూ.కోటిన్నర పలుకుతున్న భూములకు కేవలం ఎకరానికి రూ.7 లక్షలు ఇస్తామని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. ఇప్పటి వరకు ఉన్నత స్థాయి అధికారులెవరూ తమతో చర్చలు జరపలేదని, రిటైర్డ్ ఎమ్మార్వో, రిటైర్డ్ ఆర్డీవోలతో సమావేశాలు నిర్వహించి ఉన్నతాధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరిట తమ విలువైన భూములను గుంజుకోవడానికి సిద్ధపడడమేగాకుండా కనీసం తమ అభిప్రాయాలకు కూడా విలువ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మారిపోయి తమ గ్రామాల గుండా వెళ్తోందని ఆరోపించారు. గతంలో ప్రతిపాదించిన విధంగానే పాత అలైన్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.


వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ


అభిమానులతో సెల్ఫీ దిగుతున్న సినీ నటుడు పోతినేని రామ్

సందడే సందడి

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో సినీ నటుడు పోతినేని రామ్ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ వ్యవస్థాపకుడు, చైర్మన్ మావూరి వెంకటరమణ, సీఎంఆర్ ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడారు. సినీ నటుడు తనికెళ్ల భరణి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ సీ.జైపాల్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో 'రజాకర్' చిత్ర యూనిట్


చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న రజాకర్ చిత్ర యూనిట్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రజాకర్ సినిమా యూనిట్ సిద్దిపేటలో బుధవారం సందడి చేసింది. ముందుగా జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులుర్పించారు. అనంతరం రజాకర్ చిత్రం ప్రదర్శిస్తున్న శ్రీనివాస థియేటర్‌ను చిత్ర యూనిట్ సభ్యులు సందర్శించారు. అనంతరం ప్రేక్షకులతో కలిసి సందడి చేశారు. డైరెక్టర్ సత్యానారాయణ మాట్లాడుతూ ఇది మన చరిత్ర, మన పూర్వీకుల చరిత్ర అన్నారు. చాకలి ఐలమ్మ పాత్రలో నటించిన నటి ఇంద్రజ మాట్లాడుతూ.. నాడు రజాకర్‌లు సృష్టించిన అలజడులు ఈచిత్రంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నటీనటులు మకరంద్ దేశ్ పాండే, రాజు అర్జున్, తేజ్, వేదిక, మూవీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్రోల్ల చిరంజీవి, కౌన్సిలర్ భూంపలి శ్రీహరి పాల్గొన్నారు.

తన ఆటో ఎక్కకుండా వేరే ఆటో ఎక్కారని..

- వెళ్తున్న ఆటోను ఢీకొట్టిన అడ్డా మీది డ్రైవర్
- నర్సింగ్ విద్యార్థిని తలకు గాయం, స్పృహ తప్పి పడిపోయిన మరో విద్యార్థిని


విద్యార్థినికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దిపేటకమాన్: తన ఆటోలో ఎక్కకుండా వేరే ఆటోలో ఎక్కారని కోపంతో ఓ ఆటో డ్రైవర్ విద్యార్థినులు వెళ్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కొంత మంది విద్యార్థులు పొన్నాలలోని వెంకటసాయి నర్సింగ్ కళాశాలలో చదువుతున్నారు. రోజు మాదిరిగానే కళాశాలకు వెళ్లడానికి నవ్య, ఇద్దరు స్నేహితులతో కలిసి బుధవారం ఉదయం గ్రామం నుంచి సిద్దిపేట పట్టణానికి వచ్చింది. కళాశాలకు వెళ్లడానికి ముగ్గురూ సిద్దిపేట బస్టాండ్ వద్ద దాసరి శ్రీనివాస్ ఆటోలో ఎక్కారు. అక్కడే ఉన్న ఆటోల అడ్డా వారు విద్యార్థినులను ఎందుకు ఎక్కించుకున్నావ్.. చార్జీలు తక్కువ ఎందుకు తీసుకుంటున్నావ్ అని శ్రీనివాస్‌తో గొడవ పడ్డారు. శ్రీనివాస్ వెళ్తున్న క్రమంలో పట్టణానికి చెందిన మరో ఆటో డ్రైవర్ బర్రెంకల నవీన్ తన ఆటోతో విద్యార్థినులు వెళ్తున్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నవ్య రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. మరో విద్యార్థిని మౌనిక స్పృహ తప్పి కిందపడిపోయింది. వెంటనే వారిని సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఆటో డ్రైవర్ నవీన్‌పై చర్యలు తీసుకోవాలని గాయపడిన విద్యార్థిని తండ్రి నర్సింలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం పట్టివేత


సిద్దిపేటకమాన్: మద్యం సీసాలతో పోలీసులు

సిద్దిపేటకమాన్: అక్రమంగా ఇంట్లో నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌లో వంగ ఐలేశ్ ఇంట్లో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడుపుతున్నాడనే నమ్మదగిన సమాచారం మేరకు వన్ టౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెళ్లి రైడ్ చేశారు. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన బీరు బాటిళ్లు, విస్కీ బాటిళ్లు 33.10 లీటర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షాపులపై పోలీసులను దాడి చేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని నర్ర గూడెం రాజీవ్ గృహ వద్ద కిరాణా షాప్‌లో నాగరాజు మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో మంగళవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే దయ్యారా గ్రామ పంచాయతీ పరిధిలో కిరాణా షాపులో శ్రీనివాస్ మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 18 లీటర్లు స్వాధీనం చేసుకున్నారు.

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని పుల్లూరులోని బెల్టుషాపుల్లో తనిఖీల్లో భాగంగా దాడులు నిర్వహించి ఎలాంటి అనుమతులు లేకుండా మద్యాన్ని అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ అపూర్వరెడ్డి బుధవారం తెలిపారు. సందడి రామచంద్రం అనే హోటల్ యజమాని మద్యం విక్రయిస్తుండటంతో అతడి నుంచి బీర్లు, విస్కీ సీసాల ద్వారా సమారు 12 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.